www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 25 మార్చి 2025

5

పశ్చిమ గోదావరి



భీమవరంలో 27న ఉద్యోగ దిక్సూచి : కలెక్టర్

భీమవరం: ఈ నెల 27న భీమవరంలో నిర్వహించనున్న ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ రూపొందించిన ఉద్యోగ దిక్సూచి సమాచార గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా భీమవరంలో ఈ నెల 27న మెగా ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని ఇండస్ట్రియల్ స్టైలో సిఎస్ఎస్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్లేస్మెంట్ డ్రైవ్లో సుమారు 17 ప్రముఖ కంపెనీలతో పాటు, మరికొన్ని ఇతర కంపెనీల్లో సుమారు 700 పైగా ఉద్యోగావకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18-35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు https://naipunyam.ap.gov.in రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని, అదనపు సమాచారం కోసం 9441841622, 95020 24765 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మునుగుతున్నా ముంపులో లేవంట..

సిపిఎం ఆధ్వర్యాన పోలవరం నిర్వాసితుల ఆందోళన

దద్దరిల్లిన ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణం

ముంపు గ్రామాలను 45.75 కాంటూరులో చేర్చడం దారుణం

18 ఏళ్లు నిండిన యువతకు జిల్లాకో విధంగా కటాఫ్ తేదీ న్యాయమా?

మండలం యూనిట్గా పరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ప్రతియేటా గోదావరి వరదలకు మా గ్రామాలు మునిగిపోతున్నాయి.... కొండగుట్టపై చేరి నరకం అనుభవిస్తున్నాం. అధికారులంతా ప్రత్యక్షంగా ఇక్కడ పరిస్థితులు చూస్తున్నా ముంపులో లేవంటున్నారు. మా గ్రామాలు 45.75 కాంటూరులో ఉన్నాయంటూ పరిహారంగాని, భూమికి భూమిగాని ఏఒక్కటీ ఇవ్వడం లేదు. తాము చేసిన తప్పేంటీ అని ఏలూరు కలెక్టరేట్ వద్ద వందలాది మంది పోలవరం నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన మద్దిగుట్ట, బంజిగూడెం, యల్లప్పగూడెం కొత్తూరు, మాధవరం, శుద్ధగుంప, వసంతవాడ వంటి పలు గ్రామాలకు చెందిన వందలాది మంది నిర్వాసితులు వంద కిలోమీటర్లకుపైగా తరలొచ్చి కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులకు వినతులిచ్చారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని, మండలం యూనిట్గా గుర్తించి అందరికీ పరిహారం ఇవ్వాలని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికీ పరిహారం అందించాలని నిర్వాసితులంతా పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న నిర్వాసితులను రోజురోజుకీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. మొదటి కాంటూరు అని చెబుతూ గొమ్ముగూడెం, కుక్కునూరు ఎ-బ్లాక్, కివ్వాక, చీరవల్లి, దామరచర్ల, గుంపెనపల్లి, బోనగిరి, సీతారామపురం తరలించడం కోసం గతంలో నిర్వహించిన వ్యక్తిగత సాక్షికి 6,36,000 నిర్వాసితుల ఖాతాల్లో జమ చేశారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కాంటూర్ లెక్కలు తప్పని 2022 గోదావరి వరదలు తేల్చాయన్నారు. ఏళ్లు గడుస్తుంటే జనాభా పెరుగుదల, వయస్సు పెరగడంతో 18 ఏళ్లు దాటినవారి సంఖ్య పెరిగిందన్నారు. బాధితుల సంఖ్యను తగ్గించడం నిర్వాసితుల పట్ల అమానుషత్వమేనన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు కటాఫ్ తేదీ 2022 అక్టోబర్ ఏదో తేదీగా నిర్ణయించి, ఈ జిల్లాకు 2017గా నిర్ణయించడం అన్యాయమని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంటూర్తో సంబంధం లేకుండా పరిహారం ఇస్తామని చెప్పి తొలుత తరలించే గ్రామాలకే పరిహారం చెల్లించడం దుర్మార్గమన్నారు. కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని యూనిట్గా తీసుకుని పరిహారం చెల్లించాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఖాళీ చేయించే రోజునే ప్రాతిపదికగా జాబితాలోకి తీసుకుని పరిహారం చెల్లించాలని, తాతలు, తండ్రుల పేరు మీద వచ్చిన పరిహారం వారి వారసులకు ఇవ్వాలన్నారు. గతంలో రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.ఐదు లక్షలు, గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.పది లక్షల హామీని ఈ ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. వెంకటాపురం నుండి కుదుములపాడు వరకు రోడ్డును వెంటనే పూర్తి చేయాలని, మండలంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కుక్కునూరు మండల కేంద్రంలో సామూహిక ఐకిరంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పునరావాస పరిహారం పెంచాలని, ప్రతి నిర్వాసితునికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగులో ఉన్న పోడు భూములను సర్వే చేసి ప్రతి ఎకరాకూ పరిహారం చెల్లించాలని, ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో 25 రకాల మౌలిక వసతులు కల్పించాలన్నారు. వివాహమైన ఆడపిల్లలకు పునరావాస పరిహారం చెల్లించాలన్నారు. ముంపు మండలాల సిపిఎం నాయకులు వై.నాగేంద్రరావు, ధర్మూల రమేష్, మడివి దుర్గారావు ఇతర నాయకులు నిర్వాసిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.లింగరాజు, పి.రామకృష్ణ, వెంకట్రావు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం వద్ద 45 అడుగులకు వరదొస్తే మా గ్రామం ముంపులోకి

తురకం రాముడు, ఆంధోతులవారిగూడెం, కుక్కునూరు మండలం



మా గ్రామంలో 83 కుటుంబాలు ఉన్నాయి. భద్రాచలం వద్ద 45 అడుగులకు వరద నీరు చేరితే మా గ్రామం మునిగిపోతుంది. అలాంటి మా గ్రామాన్ని 45.75 కాంటూరులో చేర్చారు. దీంతో పునరావాస ప్యాకేజీగాని, భూమికిభూమిగాని ఏఒక్కటీ మా గ్రామానికి ఇవ్వలేదు. ప్రాజెక్టు పూర్తయితే మా పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు.

ప్రతియేటా ఇళ్లు దెబ్బతినడం, బాగు చేయించడంతోనే సరిపోతుంది

మేడిపల్లి బాబు, మాధవరం, కుక్కునూరు మండలం



మా గ్రామంలో 500 కుటుంబాలు ఉన్నాయి. ప్రతియేటా గోదావరి వరదలకు ఇళ్లన్నీ మునిగిపోతున్నాయి. వరద తగ్గిన తర్వాత రూ.వేలకు వేలు ఖర్చుపెట్టి ఇళ్లు బాగుచేసుకోవాల్సి వస్తోంది. అయినప్పటికీ మా గ్రామం 45.75 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వలేదు. మా గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వాలి. లేకపోతే మా పరిస్థితి అత్యంత దారుణంగా మారుతుంది.

సమయాన్ని కేటాయించి సమస్యలు పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం



ప్రజల నుంచి సమస్యలు వింటున్న కలెక్టర్ నాగరాణి

పిజిఆర్ఎస్లో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రతిరోజూ కొద్ది సమయాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి, జెసి టి.రాహుల్కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డితో కలిసి ప్రజల నుంచి 241 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి శాశ్వత పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులు ఎట్టి పరిస్థితుల్లో తిరిగి ఓపెన్ కాకూడదన్నారు. అర్జీదారునికి సంతృప్తికరమైన న్యాయమైన పరిష్కారం చూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అంతే బాధ్యతగా అధికారులు ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. డిపిఒ అరుణశ్రీ, డిఆర్డిఎ పీడీ వేణుగోపాల్, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి పాల్గొన్నారు.

నాటు సారా నిర్మూలనకు కృషి చేయాలి

నాటు సారా వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా నవోదయం నాటుసారా నిర్మూలన కార్యక్రమంపై వాల్పోస్టర్, బుక్లెట్ను జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మీ, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, అసిస్టెంట్ కమిషనర్ కెవిఎన్.ప్రభుకుమార్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఆర్.కమలేశ్వరన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారా తాగడం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచి, నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ నాటు సారా అమ్మడం, తయారు, రవాణా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పిడి యాక్ట్ నమోదు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని ఎనిమిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల వరకూ జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ ఎవరైనా పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారు చేసినా, అమ్మినా, నిల్వ ఉంచినా, గంజాయి, తదితర మాదక ద్రవ్యాలు తయారు చేసినా, రవాణా చేసినా ఎక్సైజ్, పోలీస్ అధికారులకు 14405 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా సమాచారాన్ని అందించాలని తెలిపారు. సిఐలు కెవిఎన్.కళ్యాణ్ చక్రవర్తి, కె.బలరామరాజు, ఎం.శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు, ఇ.స్వరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు

జిల్లాలోని సమస్యలపై నివేదికలు రూపొందించిన ఇద్దరు కలెక్టర్లు

సమస్యల పరిష్కారానికి మోక్షం లభించేనా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాజధానిలో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరు కానున్నారు. ఇప్పటికే ఇద్దరు కలెక్టర్లు జిల్లాలోని ప్రధాన సమస్యలపై నివేదిక తయారు చేసుకున్నారు. జిల్లాలవారీగా ప్రెజెంటేషన్ ఇచ్చే సమయంలో జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి మోక్షం లభించేలా మాట్లాడాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. ఏలూరు జిల్లా పరిధిలో ప్రధానంగా పోలవరం నిర్వాసితుల సమస్య పరిష్కారంకావాల్సి ఉంది. చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయాల్సి ఉంది. కొల్లేరు సమస్య తీవ్రరూపం దాల్చడంతో దీన్ని ప్రధాన సమస్యగా జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చించాల్సిన ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయి. కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణంపై, జిల్లాలో తాగునీటి సమస్యపైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. దీనికి సంబంధించిన సమస్యలు అనేకం ఇప్పటికీ పరిష్కారం కాకుండా ఉన్నాయి. ఆదివాసీలు జిల్లాలో కొలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను, కోకో, మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. కౌలు రైతులకు బ్యాంకు రుణాల సమస్య సంబంధించిన ఇబ్బందులను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని అంతా కోరుతున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి చేయాల్సి ఉంది. సంక్షేమ పథకాలు అమలు కాకపోవటంతో జనాలు పలు సమస్యలు ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం, మధ్యలోనే ఆగిపోయిన అంగన్వాడీ, వివిధ ప్రభుత్వ భవనాలకు సంబంధించి చర్చించాల్సి ఉంది. ఏలూరు బోధనా ఆస్పత్రిలో డాక్టర్ల సమస్య ఇబ్బందులపై సదస్సులో లేవనెత్తాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ప్రధానంగా కాలుష్యం సమస్య ఎక్కువగా ఉంది. పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యంతో జనాలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు. కేన్సర్ వంటి రోగాలు భారీగా పెరుగుతున్నాయి. కాలుష్యం అరికట్టడంపై పశ్చిమ కలెక్టర్ గట్టి చర్యలు ప్రతిపాదించాల్సి ఉంది. డెల్టా ఆధునికీకరణ గురించి, ఇటీవల కాలంలో మేత, మందుల ధరలు పెరిగిపోయి ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరలు అమాంతం తగ్గిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి శాశ్వత పరిష్కారంపై సదస్సులో కలెక్టర్ మాట్లాడాల్సి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని పరిస్థితి ఉంది. త్వరితగతిన వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు సంబంధించి సిఎం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. అలాగే నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు గురించి మాట్లాడాల్సిన ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటు, జిల్లా ఆస్పత్రికి సంబంధించి వెంటనే తీసుకోవాల్సిన చర్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. కేన్సర్ రోగులకు పింఛను ఇచ్చే అంశంపై కలెక్టర్లు ఇద్దరు సిఎం ఎదుట ప్రతిపాదించాల్సి ఉంది. జిల్లాలో ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లు మాట్లాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

సమస్యలకు పరిష్కారం చూపని బడ్జెట్లు

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉద్యోగులు, కార్మికులు, స్కీం వర్కర్ల సమస్యలకు ఏ మాత్రమూ పరిష్కారం చూపించలేదని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రకాశ్ అండ్ డైస్ మర్కంట్ భవనంలో సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిఆర్సీకి, వేతన పెంపు కోసం, ఇతర సౌకర్యాల కల్పనకు బడ్జెట్లో నిధులు కేటాయించలేదన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వేతన జీవులకు నెలనెలా వేతనాలివ్వడంలో ఆయా శాఖల్లో పెండింగ్ బిల్లులు క్లియర్ చేయడానికి ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఆయా రంగాలకు గత బడ్జెట్లో కేటాయించిన నిధుల్లో కోత విధించిందన్నారు. అన్నీ అరకొరగా విదిలించి చేసి గొప్ప బడ్జెట్ అంటూ పాలకులు జబ్బలు చర్చుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. మరోపక్క అన్ని రకాల ధరలూ విపరీతంగా పెరుగుతున్నా తగ్గించేందుకు ఎటువంటి నిర్ణయాలూ తీసుకోలేదన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ జరగడంటూనే చేయడానికి అనుకూల ముందుకు వేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్లు అమలు చేసి కార్మికుల పొట్టకొట్టే ప్రయత్నం పాలకులు చేస్తున్నారని విమర్శించారు. రైతాంగానికి గిట్టుబాటు ధర చట్టం చేస్తామన్న హామీని అమలు చేయడానికి పాలకులు ముందుకు రావడం లేదన్నారు.

8 గంటల పని హక్కు నినాదంతో మేడే వేడుకలు

8 గంటల పని హక్కును కాపాడుకుందాం అనే నినాదంతో మేడే వేడుకలు జరపాలని ఉమామహేశ్వరరావు చెప్పారు. జెండా ఆవిష్కరణలు, ర్యాలీలతో పాటు కార్మిక వాడల్లో, పని ప్రదేశాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించాలన్నారు. మేడే ప్రాధాన్యత, స్ఫూర్తితో నేడున్న పరిస్థితుల్లో ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలన్నారు. మే 20న దేశవ్యాప్త సమ్మె జరగబోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మె చేయాలని నిర్ణయించాయన్నారు. సమ్మె జయప్రదం కోసం జిల్లా, రాష్ట్రంలో అన్ని తరగతుల ఉద్యోగ కార్మికుల వద్దకు వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. అందరూ సమ్మెలో పాల్గొనే విధంగా, సమ్మెకు సంఘీభావం తెలియజేసే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర పాలకులు పన్నిన మతోన్మాద ఉచ్చులో రాష్ట్ర పాలకులు కూడా పడిపోయారని విమర్శించారు. క్రైస్తవ చర్చలకు అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలించాలని సర్క్యులర్ విడుదల చేయడం, దేవాలయాల్లో ఇతర మతస్తులను తొలగించాలని ఆలోచన చేయడం, అన్ని రాష్ట్ర రాజధానుల్లో టిటిడి నిధులతో ఆలయాలను నిర్మించాలని చెప్పడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్వి.గోపాలన్ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్, సిఐటియు జిల్లా నాయకులు పి.వి.ప్రతాప్, సూర్నీడి వెంకటేశ్వరరావు, టి.సత్యనారాయణ, ఎన్.రంగారావు, కె.గుప్పన్ లక్ష్మి, ఎమ్.డి హసీనా, డి.జ్యోతి, ఎం.త్రిమూర్తులు, జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంఘీభావ నిధి సేకరణలో ఉమామహేశ్వరరావు

అమెరికా ఆంక్షలు తట్టుకొని నిలబడడమే కాకుండా ప్రపంచానికి ఆదర్శంగా ఉన్న సోషలిస్టు క్యూబాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశాల సందర్భంగా క్యూబా సంఘీభావ నిధి సోమవారం సేకరించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ క్యూబాలోని ప్రజలు సోషలిస్టు వ్యవస్థను రక్షించుకుంటున్నారన్నారు. అక్కడి విద్య, ఆరోగ్య వ్యవస్థ బలంగా ఉన్నాయన్నారు. అక్కడి ప్రభుత్వం ఆ దేశంలో ఉన్న ప్రజలందరికీ అన్ని రకాల సౌకర్యాలనూ అందించడంలో ముందుంటున్నారు. అమెరికా మీద ఆధారపడకుండా అన్ని రకాల సేవలు, సౌకర్యాలను ఆ దేశ ప్రజలకు అందిస్తున్న సోషలిస్టు ప్రభుత్వం అమెరికా నుంచి అనేక దాడులను ఎదుర్కొంటున్నారు. క్యూబా ప్రపంచానికే ఆదర్శమన్నారు. సమావేశానికి హాజరైన వారందరూ తమ వంతు ఆర్థిక సహకారం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్వి.గోపాలన్, కె.రాజా రామ్మోహన్ రాయ్, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

తాగునీరందించాలని కాలనీవాసుల ధర్నా

ప్రజాశక్తి - నరసాపురం

తమ కాలనీలకు తాగునీరు అందించాలని కోరుతూ మర్రితిప్ప, సీతారాంపురం నార్త్ గ్రామాల ప్రభుత్వ కాలనీవాసులు ఖాళీ బిందెలతో స్థానిక ఆర్డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో తాగునీరు అందకపోవడం దారుణమన్నారు. సీతారాంపురంలో కూరాయి చేరారని, అయితే ఆ కుళాయిలకు నీరు సరఫరా అయ్యే పైపులైను వేయలేదని అన్నారు. మర్రితిప్ప కాలనీలో పైపులైను వేసినప్పటికీ నీరు సక్రమంగా అందడం లేదని తెలిపారు. ఇప్పటికే తాగునీటి సమస్య ఉందని, ప్రస్తుతం ఎండలు పెరగడంతో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదని మండల, జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకొని తాగునీటి సమస్య పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కాలనీవాసులతో నిరసన దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా అనంతరం స్పందన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణరావు, గుబ్బల పెద్దిరాజు, గుబ్బల వెంకటేశ్వరరావు, గంగులజ్యోతి, నాగళ్ల సత్యనారాయణ, గుప్పల జయలక్ష్మి, గుబ్బల నాగలక్ష్మి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాలనీ వాసులు

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ఐదుగురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

కూలీలను పరామర్శించిన వ్యవసాయ కార్మిక సంఘం నేతలు



గాయపడిన కూలీని పరామర్శిస్తున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలపై పని ప్రాంతంలో తేనె టీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ఐదుగురు కూలీలకు గాయాలు కావడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. మండలంలోని మోగల్లులో సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఉపాధి కూలీలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోగల్లు - గరగపర్రు రహదారిలోని మురుగుకోడు పూడికతీత పనికి ఉదయం 7 గంటలకు సుమారు 81 మంది కూలీలు వెళ్లారు. పనిచేస్తుండగా మురుగుకోడుకు దగ్గర చెట్టు కొమ్మలు కొడుతుండగా తేనెటీగలు ఒక్కసారిగా లేచి కూలీలపై దాడి చేశాయి. దీంతో కూలీలంతా పరుగులు తీసే ప్రయత్నం చేసినప్పటికీ గ్రామానికి చెందిన నేతల ఏసోబు, సైదు రాములమ్మ, కుడిపూడి మంగ, బుంగా యోహను, రూపేన్ వెంకటేశ్వరరావు తేనెటీగల దాడికి గురయ్యారు. ముఖం, కాళ్లు, చేతులు, నడుము భాగాల్లో గాయాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఇజిఎస్ మేట్ జాలే సునీత, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, ఉపాధి కూలీ కోణాల ప్రకాష్ క్షతగాత్రులను వైద్యం నిమిత్తం పాలకోడేరు పిహెచ్సికి తరలించారు. వైద్యాధికారి స్వర్ణ నిరంజని గాయపడిన వారికి చికిత్స చేశారు. అయితే కూలీలు ఏసోబు, రాములమ్మకు తేనెటీగలు ఎక్కువగా కుట్టడంతో వారిని ఆసుపత్రిలోనే ఉంచి చికిత్స అందించిన అనంతరం ఇంటికి పంపించారు. తేనెటీగల దాడికి గురైన ఉపాధి కూలీలకు ఎటువంటి ప్రమాదమూ లేదని వైద్యాధికారి స్వర్ణ నిరంజని తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ టెక్నికల్ అసిస్టెంట్ ఆలీష్ ఆయుబాల జరుగుపాటి సంఘటన వద్ద కూలీలను పరామర్శించి జరిగిన ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేయడం పట్ల వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కోలుకునేంత వరకు మస్టర్ యథావిధిగా కొనసాగించాలి : వ్యకాస

తేనెటీగల దాడికి గురైన ఉపాధి కూలీలకు పూర్తి వైద్య సేవలందించి పనికి వెళ్లే వరకూ మస్టర్ యథావిధిగా కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కం శెట్టి సత్యనారాయణ అధికారులను డిమాండ్ చేశారు. తేనెటీగల దాడిలో గాయాలు పాలైన కూలీలను మోగల్లులో వారి ఇంటికి వెళ్లి సత్యనారాయణ పరామర్శించి మాట్లాడారు. తేనెటీగల దాడికి గురైన కూలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ముఖ్యంగా ఏసోబు పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఉపాధి పని ప్రాంతంలో అనేక విషసర్పాలు, తేనెటీగలు, తాగేసి పడేస్తున్న మద్యం సీసాలు, తువ్వు పట్టిన ఇనుప ముక్కలు ఉంటున్నాయన్నారు. ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో పనులు చేస్తున్నారన్నారు. జిల్లాలో నెలల తరబడి వేతనాలు పెండింగ్లో ఉన్నాయన్నారు. సమయానికి వేతనాలు ఇవ్వకపోవడంతో కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పే స్లిప్పులు, జాబ్ కార్డులు ప్రభుత్వమే అందించాలన్నారు. పని కావాలని అడిగిన వారికి పని కల్పించడంతోపాటు భృతి ఇవ్వాలన్నారు. రూ.600 కనీస వేతనం, 200 రోజుల పని దినాలు చూపించాలని డిమాండ్ చేశారు.

వేతనాలు చెల్లించాలని ఉపాధి కూలీల నిరసన

ప్రజాశక్తి - ఇరగవరం



రేలంగిలో నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరించడం సరి కాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని విమర్శించారు. రేలంగి పంచాయతీ పరిధిలో కేతావారిపాలెంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ పని చేసినప్పటికీ వేతనాలు చెల్లించకపోవడం వల్ల కూలి పనికేమున్నది బతికే తమ పరిస్థితి ఏమిటనే వీరభద్రరావు వద్ద కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా వారిని దారి మళ్లించి వారి పొట్టకొడుతున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యవహారం చూస్తుంటే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే ఎత్తుగడలను కుట్ర చేస్తోందన్నారు. వెంటనే పెండింగ్ ఉన్న వేతనాలను ఎప్పటికప్పుడు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు సరిపడా పని కల్పించి తగిన వేతనాలను చెల్లించాలన్నారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వై.ఈశ్వరరావు, పనిముట్లు పట్టుకుని వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కూలీలతో కలిసి వినూత్న నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేతా అరుణ, పిచ్చెట్టి శ్యామ, గుడాల కనకదుర్గ, కేతా శివన్నారాయణ, దొమ్మేటి రామకృష్ణ, కేతా రాంబాబు, దొమ్మేటి లక్ష్మి, కేతా సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ రీడర్ల పొట్ట కొట్టొద్దు

ప్రకాశం చౌక్లో ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం



నేతలు, పోలీసులు మధ్య వాగ్వివాదం

విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో విద్యుత్ మీటర్ రీడర్లను రోడ్డున పడేయొద్దని, మీటర్ రీడర్స్ పొట్ట కొట్టొద్దని, ప్రత్యామ్నాయం చూపి ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఏపిఎస్ఇబి విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రకాశం చౌక్ సెంటర్లో ఆందోళన చేపట్టి, కలెక్టరేట్ వరకూ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తిరుమల విద్యాసంస్థల వద్ద నేతలను పోలీసులు అడ్డగించారు. కలెక్టరేట్లోకి ఒక్కరు మందికి అనుమతి లేదని ర్యాలీ ముందుకు సాగేందుకు కుదరదని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో నేతలకు పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అయితే పోలీసులు పది మంది నేతలను కలెక్టరేట్లోకి వెళ్లేందుకు అనుమతివ్వడంతో వారు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ ఏస్టోస్ అకౌంట్ ద్వారా వేతనాలు చెల్లించాలని, గతంలో సంస్థ సిఎండి మీటర్ రీడర్లకు మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ భీమవరం డివిజన్ అధ్యక్షులు పెనుమాక జకబ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో 4,500 కుటుంబాలను రోడ్డున పడేయొద్దని కోరారు. ఏపిఎస్ఇబి రాష్ట్ర యూనియన్ నెల్లూరి సుబ్బారావు మాట్లాడారు. ఏపిఎస్ఇబి జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, చేకూరి కృష్ణ, సంఘీభావం తెలిపిన సిఐటియు జిల్లా నాయకులు ఎం.సీతారాంప్రసాద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వైఎన్.ఆనంద్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎం.లక్ష్మణ్, విద్యుత్ మీటర్ రీడర్స్ జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీనివాసరావు, నరసాపురం డివిజన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గణితం పరీక్ష ప్రశాంతం

పెనుమంట్ర : మండలంలో సోమవారం జరిగిన టెన్త్ గణితం పరీక్షకు 508 మందికి, 501 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు తెలిపారు. పొలమూరు హై స్కూల్ సెంటర్‌లో 72కు 71 మంది, మార్టేరు ఎస్‌విజి హైస్కూల్ సెంటర్‌లో 199కు 195 మంది, మార్టేరు గరల్స్ హై స్కూల్ సెంటర్‌లో 68కి 67 మంది, పెనుమంట్ర హై స్కూల్ సెంటర్ నుంచి 169కి 168 మంది విద్యార్థులు హాజరు అయ్యారని, ప్రశాంతంగా పరీక్షలు జరిగాయని ఆయన పేర్కొన్నారు. **నరసాపురం:** మాథ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఇఒ పి.పుష్పరాజ్యం తెలిపారు. ఇంగ్లీషు పరీక్షకు పట్టణం, మండలంలోని ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థులకు 1761 మందికి గాను 1719 హాజరయ్యారన్నారు. మొత్తం 42 మంది గైర్హాజరయ్యారు. **ఉండి:** మండలంలో సోమవారం నిర్వహించిన పదో తరగతి గణితశాస్త్రం పరీక్షలో 13 మంది గైర్హాజరు అయ్యారని ఎంఇఒ కార్యాలయ సిబ్బంది తెలిపారు. 628 మంది విద్యార్థులకు గాను 615 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని, 13 మంది గైర్హాజరయ్యారని మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం, యండగండి పరీక్షా కేంద్రాలలో స్క్వాడ్ తనిఖీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. **మొగల్తూరు :** మండలంలోని గ్రామాలలో ఐదు పరీక్ష కేంద్రాల్లోని 4వ పరీక్ష లెక్కలు ప్రశాంతంగా జరిగింది. 788 మంది విద్యార్థులకుగాను 776 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఇఒ యు.శామ్యూల్ జాన్ తెలిపారు. మొగల్తూరులో 1, కేపీ పాలెం 3, ముత్యాలపల్లి 5, శేరేపాలెం 2, జగన్నాథపురం 1 విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదని ఆయన తెలిపారు. ఫస్ట్ టైం ఫెయిల్ అయిన విద్యార్థులు కేపీ పాలెంలోని 4 విద్యార్థులకు గాను 2 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

వీరవాసరం : నియోజకవర్గంలోని మట్టి రోడ్లు అన్నింటినీ అభివృద్ధి చేయడమే లక్ష్యంతో భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు పనిచేస్తున్నారని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్ అన్నారు. తోలేరు పంచాయితీ పరిధిలోని పడమటిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఎంపిపి సోమవారం ప్రారంభించారు. పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు రూ.5 వేలుతో ఒక మట్టి రోడ్డును గ్రావెల్ రోడ్డుగాను, రూ.10 లక్షలతో చెరువు గట్టుపై స్థానిక ప్రజల అవసరార్థం వాకింగ్ ట్రాక్‌గా అభివృద్ధి చేయుటకు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడ్డాల రాము, సర్పంచి వేండ్ర లీలావెంకటకృష్ణ, నీటిసంఘం అధ్యక్షుడు యిర్రింకి బటరామమూర్తి, ఎఇ రమేష్‌లు పాల్గొన్నారు.

'సంక్షేమం, అభివృద్ధి టిడిపి లక్ష్యం'

భీమవరం టౌన్ : కోటిమందికిపైగా సభ్యత్వాలు కలిగిన అతిపెద్ద రాజకీయపార్టీ టిడిపి సంక్షేమం, అభివద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని టిడిపి రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. సోమవారం భీమవరం నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో టిడిపి సభ్యత్వ ఐడికార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ టిడిపి సభ్యత్వం ఉన్న ప్రతిఒక్క కార్యకర్త ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబసభ్యులకు ఐదు లక్షల ప్రమాద బీమా నగదును అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అంగన్వాడీ ప్రధాన కార్యదర్శి మెరగాని నారాయణమ్మ, టిడిపి రాష్ట్ర కార్యదర్శులు కోళ్ల నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

కంప్యూటర్లు బహూకరణ

భీమవరం టౌన్ : మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంకు భీమవరం స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్ వారు రూ.లక్షా 20 వేలు విలువ చేసే 2 కంప్యూటర్స్ సోమవారం అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఎస్‌బిఐ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎస్.గురవయ్య, చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ రాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి : ఎస్ఐ

భీమవరం టౌన్ : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని భీమవరం ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ అన్నారు. భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జెపి రోడ్డులోని పెట్రోల్ బంక్‌లో మోటార్ మెకానిక్ వర్కర్స్‌తో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం 100 మందికి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

డిపాజిట్‌దారులను ఆదుకుంటాం : ఎంఎల్ఎ

తణుకు రూరల్ : గత పాలకులు చేసిన కుంభకోణంలో నష్టపోయిన డిపాజిట్ దారులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం కృషిచేస్తోందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని తేతలి సొసైటీలో గత ప్రభుత్వ హయాంలో రూ.4.64 కోట్లు కుంభకోణం చేసి నిధులను పక్కదోవ పట్టించారని, వీటిలో రూ.1.67 కోట్లు మేర డిపాజిట్ చేసిన బాధితులను దశలవారీగా ఆదుకుని వారికి తిరిగి చెల్లించే విధంగా చర్యలు చేపట్టామని తణుకు ఆయన అన్నారు. సోమవారం ఎంఎల్ఎ కార్యాలయంలో 8 మంది డిపాజిట్ దారులకు సుమారు రూ.35.37 లక్షలు మేర చెక్కులను అందజేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

47 ఫిర్యాదుల స్వీకరణ

నరసాపురం: పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 47 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించడం జరిగిందని ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెనుమంట్ర : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 15వ ఆర్థిక సంఘం రూ.14 లక్షల 95 వేల నిధులతో మార్టేరులోని కొన్ని ప్రాంతాల్లో డ్రైయిన్లు, సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం సోమవారం చేపట్టినట్లు టిడిపి మండల కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షుడు కోనాల శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు తేతల సోమిరెడ్డి, గ్రామ సర్పంచి మట్టా కుమారి, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డాక్టర్ బిందు ప్రవీణకు డాక్టరేట్

ఉండి: ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన శాస్త్రవేత్తగా సేవలందిస్తున్న డాక్టర్ ఆర్.బిందు ప్రవీణ భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ నుంచి డాక్టరేట్ పొందినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.బిందు ప్రవీణ మాట్లాడుతూ టిష్యూ కల్చర్ విధానంలో ద్రాక్ష పంటను నీటి ఎద్దడి తట్టుకొని ఏవిధంగా పండించాలి అనే పరిశోధనకు గాను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రులు భగీరథ చౌదరి, రామనాథ్ ఠాగూర్ చేతుల మీదుగా ఢిల్లీలో డాక్టరేట్ అందుకున్నట్లు వారు వివరించారు.

విపత్తుల సమయంలో జాగ్రత్తలపై అవగాహన

మొగల్తూరు : విపత్తు సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తినష్టం నివారణా చర్యలు తక్షణం చేపట్టాలని ఎన్‌డిఆర్ఎఫ్ వైర్లెస్ రోనంకి కుర్మారావు అధికారులకు సూచించారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయ ఆవరణలో సోమవారం వర్షాకాల ప్రభావం సమయంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, ఫైర్ ఆఫీసర్ భాస్కర్ రామ్, ఆర్‌టిఐ కెఎస్ఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుని అరెస్ట్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి సోమవారం ప్రకటన విడుదల చేశారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు దొరబాబు, మురళీ సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని ముద్దాయి గ్రామంలో దాడులు నిర్వహించి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 06 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

మొగల్తూరు : ఉపాధి హామీ పథకంలో గత 15 సంవత్సరాలుగా పెద్దింగు భరణి కుమార్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధిగా సేవలు అందించారని ఎపిఒ సిహెచ్.త్రిశూలపాణి అన్నారు. పాతపాడు గ్రామానికి చెందిన పెద్దింగు భరణి కుమార్(52) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఉపాధి హామీ ఎపిఒ జ్వాల వెంకటేశ్వరరావు, జెడివి ఆనంద్, కంప్యూటర్ ఆపరేటర్ మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

క్షయ వ్యాధి నివారణపై పలుచోట్ల అవగాహన

గణపవరం : క్షయ వ్యాధి నివారణపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని పిఎంపి అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె పరమేశ్వర్లు అన్నారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణా దినోత్సవం పురస్కరించుకుని సోమవారం మండలంలోని పిఎంపి అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహనా ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పరమేశ్వర్లు మాట్లాడుతూ 1982 నుంచి ప్రతీ ఏడాది మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం జరుపుతున్నట్లు చెప్పారు. క్షయవ్యాధి దగ్గుతున్న వ్యక్తుల నుంచి గాలి ద్వారా వేరొకరికి సోకుతుందని చెప్పారు. క్షయ వ్యాధిగ్రస్తులు ఇంట్లోనే ఉండాలని మాస్కు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో అసోషియేషన్ మండల కార్యదర్శి శివ శ్రీనివాస్ రావు, కోశాధికారి కొటకల అప్పారావు, ఇసి సభ్యులు పానకాలు మస్తాన్ వల్లి పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో క్షయవ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ క్షయవ్యాది లక్షణాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి, వైస్ ప్రిన్సిపల్ మధురాజు, కాలేజీ లెక్చరర్లు, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మాధవరం పిహెచ్‌సి పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి టి.సింధు మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పరీక్షలు చేయించుకుంటే క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాధవరం పిహెచ్‌సి వైద్యులు ఎవి.వెంకటేష్, ఎంపిహెచ్‌ఇఒ జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.అశోక్ బాబు, సిహెచ్.మణి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు. **పాలకొల్లు రూరల్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవ ర్యాలీ లంకలకోడేరు సచివాలయం వద్ద, చింతపర్రు సచివాలయం ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపు వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల శ్రద్ధ వహించి, క్షయ వ్యాధి రహిత భారత్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్, సర్పంచి గుమ్మపు పెద్దిరాజు, ఉపసర్పంచి కృష్ణంరాజు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మసీ అధికారి పివి.స్వామి, ఎస్‌కె.అమలేశ్వరరావు పాల్గొన్నారు.



పాలకొల్లు రూరల్ : అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న పిహెచ్‌సి వైద్యులు

పలుచోట్ల పి-4 సర్వే

తణుకు : పి-4తో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని తణుకు నియోజకవర్గ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం తణుకు పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఉగాది నుంచి ప్రభుత్వం పి-4 విధానాన్ని అమల్లోకి తీసుకువస్తోందని తెలిపారు. కేవలం పదవులు అలంకారప్రాయం కాకుండా కాలనీ అభివృద్ధికి కృషిచేస్తున్న పాలకవర్గాన్ని ఆయన అభినందించారు. హౌసింగ్ బోర్డు నూతన పాలకవర్గం అధ్యక్షులుగా రాంబాబు, ఉపాధ్యక్షులు ప్రసాదరెడ్డి, గూడూరి సత్యనారాయణతో పాటు మిగిలిన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గణపవరం : పేదరికం నిర్మూలనకు పి-4(పీపుల్ పబ్లిక్ ప్రయివేట్ ప్రోవిరిటి సర్వే) ఉపయోగపడుతుందని జనసేన మండలాధ్యక్షులు తోట శ్రీను అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ ఆవరణలో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఈసభకి గణపవరం సర్పంచి మూరా అలంకారం అధ్యక్షత వహించారు. సభలో పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ సర్వేలో గుర్తించిన లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. సర్వేలో నిరుపేదలుగా ఉన్నవారి పేర్లు జాబితాలో లేకపోతే వారి పేర్లు తెలుసుకొని తమకి తెలపాలని పంచాయతీ సిబ్బందికి చెప్పారు. ఈ సభలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : వివిధ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులను గుర్తించడం కోసం ప్రభుత్వం పి-4 సర్వే నిర్వహించడం జరుగుతుందని, అంతా సహకరించాలని నెగ్గిపూడి గ్రామ గ్రేడ్-1 కార్యదర్శి గుత్తికొండ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన గ్రామసభకు సర్పంచి మామిడిశెట్టి ధనలక్ష్మి అధ్యక్షత వహించారు. వివిధ గ్రామాభివృద్ధి అంశాలను విఆర్ఒ కె.నాగ మల్లేశ్వర రావు అందరికి వివరించారు. ఉప సర్పంచి అల్లం బాలసాయి రెడ్డి, వార్డ్ సభ్యులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆచంట : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక పరిపుష్టి పొందాలని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. పేదరిక నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా సోమవారం భీమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి గుబ్బల మాధవరావు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి ఎస్.సురేష్, పి-4 సర్వేలో లబ్ధిదారుల జాబితాను గ్రామ సభలో వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేత వీరయ్య, కూటమి నేతలు బీర నర్సింహ మూర్తి పాల్గొన్నారు. **మొగల్తూరు :** మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో పి-4 సర్వే నివేదికలపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. సర్వేలో గుర్తించిన పేదల పేర్లను చదివి వినిపించారు. ఎన్ఆర్ఐలు పేదలను దత్తత తీసుకుని అభివృద్ధి పరచనున్నారని ఆ సభలో తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కాళ్ల : బాధిత కుటుంబానికి దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం చేశారు. కాళ్లకూరు గ్రామం వెంకటాపురంకు చెందిన సోము సుబ్బారావు భార్య ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఆ విషయం తెలుసుకుని శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ దాట్ల వెంకట రామరాజు అంత్యక్రియలకు రూ.5 వేలు అందించేందుకు ముందుకు వచ్చారు. ట్రస్ట్ సభ్యులు సోమవారం మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్ దాట్ల వెంకట రామరాజు పంపిన నగదును సోము ఈశ్వరమ్మ కుమారుడు సోము అప్పలనాయుడుకి అందజేశారు. 800 లీటర్ల ఆర్వో వాటర్‌ని అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పెన్మేత్సనాగరాజు, సాదు శ్రీనివాస్ పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పిహెచ్‌సికి సెంట్రీఫ్యూజ్ బహూకరణ

నరసాపురం : కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎల్‌బి చర్ల గ్రామంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కి సెంట్రీఫ్యూజ్‌ను బహుకరించారు. కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి రామ్మోహన్ నాయుడు సోమవారం గ్రామ పెద్దలతో కలిసి పరికరంను ఆసుపత్రి సిబ్బందికి అందించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ గ్రామ పెద్దలు సూచనలు, ఆసుపత్రి సిబ్బంది కోరిక మేరకు ప్రజా అవసరాల దృష్ట్యా సెంట్రిఫ్యూజ్ పరికరంను అందించడం జరిగిందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని చెప్పారు. ఆసుపత్రి వైద్యురాలు ఎం.మాధురి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి దాతలు అందిస్తున్న సేవలతో మెరుగైన వైద్యంను ప్రజలకు అందించ గలుగుతున్నామని తెలిపారు. రక్తాన్ని, ప్లాస్మాను వేరు చేసే పరికరం సెంట్రి ఫ్యూజ్‌ను అడిగిన వెంటనే బహుకరించిన నాయుడును అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గుబ్బల యమున భాను, ఎంపిపి ఎం.సోని, సీనియర్ అసిస్టెంట్ దేగల రాంబాబు, గ్రామపెద్దలు కటకంశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.


సెంట్రీఫ్యూజ్ అందిస్తున్న కొవ్వలి

తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రం : జెసి

భీమవరం : జిల్లాలోని మొట్ట మొదటిసారిగా తాడేపల్లిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ ఏడాది 38 రైతు సేవా కేంద్రాల ద్వారా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో రబీ సీజన్‌కు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఏర్పాట్లపై సివిల్ సప్లయిస్, వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన సమీక్షించి మాట్లాడారు. తాడేపల్లిగూడెంలో ఏప్రిల్ మూడో తేదీన ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్స్ డిస్టిక్ మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు, ఎంఎఒలు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా రెండో వైస్ గవర్నర్‌గా ఆర్‌విఎస్

ఆకివీడు : లయన్స్ క్లబ్ ఆఫ్ ఆకివీడు సభ్యుడు, లయన్స్ రీజనల్ ఛైర్మన్ ఆర్‌వి.సూర్యనారాయణ రాజు(పడవల రాజు) జిల్లా రెండవ వైస్ గవర్నర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు స్థానిక లయన్స్ ప్రముఖులు, అంతర్జాతీయ లయన్స్ సభ్యులు, మాజీ లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ ఎంవి.సూర్యనారాయణ రాజు సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. ఆదివారం సాయంత్రం ప్రతిష్టాత్మకంగా ఏలూరులో జరిగిన ఎన్నికల్లో సూర్యనారాయణ రాజు రెండవ జిల్లా వైస్ గవర్నర్‌గా ఎన్నికయ్యారని చెప్పారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, నూతనంగా ఆర్‌సి ఛైర్మన్‌గా ఎన్నికైన బివి.కృష్ణంరాజు, సన్నిధి రామ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సు ప్రారంభం

పాలకోడేరు : మహిళలు ఆర్థికాభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన బ్యూటీషియన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ కోరారు. మండలంలోని సమైక్య భవనంలో ఏర్పాటుచేసిన బ్యూటీషియన్ కోర్సును తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి ప్రారంభించారు. తొలి బ్యాచ్‌లో 20 మందికి 45 రోజులపాటు శిక్షణను అందజేయడం జరుగుతుందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్, ఎంపిడిఒ రెడ్డయ్య, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కె.మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెడికల్ క్యాంప్

భీమవరం టౌన్ : అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక మెంటేవారి తోటలోని పుచ్చులపల్లి సుందరయ్య భవన్లో మంగళవారం చిన్న పిల్లలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మెంటేవారితోట పుచ్చులపల్లి సుందరయ్య భవనంలో చిన్న పిల్లలకు ఉచిత గుండె మెడికల్ క్యాంపు ప్రతినెల 4వ మంగళవారం నిర్వహిస్తున్నామన్నారు.

'కరోనాలో వైద్యుల సేవలు గొప్పవి'

పెనుమంట్ర : కరోనా సమయంలో వైద్యులు అందించిన సేవలు గొప్పవని మానవతా సంస్థ మండల అధ్యక్షులు, విశ్రాంత పీడీ కర్రి కృష్ణారెడ్డి అన్నారు. మార్టేరులోని సంస్థ మీటింగ్ హాల్లో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంకు ఆయన అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన డాక్టర్ వరప్రసాద్ పేద విద్యార్థులకు సహాయంగా తన వంతుగా ఇవ్వమని రూ.5 వేలు సభలో ఆయన అందించారు. కార్యక్రమంలో పండిత విల్లూరు గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి చదలవాడ శ్యామ్యూల్ పాల్(తండ్రి మృతి, తల్లి కేన్సర్ బాధతో బాధపడుతూ ఉంది) తన చదువు మధ్యలో ఆపకుండా కొనసాగించడానికి మానవత పెనుమంట్ర శాఖ సంస్థ, సభ్యుల ద్వారా రూ.10,500 ఆర్థిక సహాయం చేశారు. డాక్టర్ దంపతులను శాలువా, మెమొంటోతో ఘనంగా సభ్యులు సత్కరించారు. మార్టేరు గ్రామ ఉపసర్పంచి కర్రి వేణుబాబు, మానవత జిల్లా కమిటీ మెంబర్ కొత్త సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

పాలకొల్లు : సిఎం చంద్రబాబు నిరుపేదలకు అన్ని రకాల వైద్యం అందేలా రాష్ట్ర బడ్జెట్లో రూ.19,264 కోట్లను కేటాయించినట్లు రాష్ట్ర జలవనురుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 28 మంది నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు రూ.12.60 లక్షల విలువైన చెక్కులను సోమవారం మంత్రి అందజేశారు. ప్రతి పేదవాడికి కార్పొరేటు వైద్యం అందేలా రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకం కూటమి ప్రభుత్వ అమలు చేయనుందని తెలిపారు. **నరసాపురం:** జనసేన కార్యాలయంలో సోమవారం ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను అందించారు. మండ ఆనంద్ రావుకు రూ.25 వేలు, కట్నం వెంకట సూర్యనారాయణకు రూ.31 వేలు, తిరుమల స్వాతి రూ.25 వేలు, పెద్దపాటి కీర్తి రూ.33,614 చెక్కులను అందించారు. కార్యక్రమంలో గుబ్బల మారాజు, గట్టెం శ్రీను పాల్గొన్నారు.

'మహిళలు స్వయం ఉపాధి సాధించాలి'

తణుకు : మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి, స్వయం వ్యవస్థాపకులుగా ఉండి, స్టార్టప్ కంపెనీలను స్థాపించి భారతదేశాన్ని బలోపేతం చేయాలని ఎన్ఐఆర్‌డి, పిఆర్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా విశ్రాంత ప్రొఫెసర్, హైదరాబాద్ డాక్టర్ శంకర్‌చటర్జీ అన్నారు. స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పిజి(అటానమస్) కళాశాలలో భారతదేశంలో వ్యవస్థాపక సామాజిక ఆర్థిక కోణాలు-చారిత్రక, రాజకీయ దృక్కోణాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సులో భాగంగా మొదటి రోజు సోమవారం కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్‌చటర్జీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారిని కూడా అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, డిసిబి బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ ఎల్.కుమారస్వామి, డిసిబి బ్యాంకు క్లస్టర్ హెడ్ శ్రీజయ రామకుమార్, గ్లోబల్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనాసాయి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర కళాశాల అధ్యాపకునికి బెస్ట్ పేపర్ అవార్డ్

నరసాపురం : మండలంలోని సీతారామపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, టెక్నాలజీ (అటానమస్) కళాశాలలో మెకానికల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేయుచున్న డాక్టర్ పి.సత్యనారాయణ రాజు బెస్ట్ పేపర్ అవార్డును అందుకున్నారు. కాకినాడ ఆదిత్య డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ వారు నిర్వహించిన సెకండ్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మెటీరియల్స్ అండ్ ఎనర్జీ సైన్స్ 2025 బహూకరించారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ పి.సత్యనారాయణ రాజుని కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కెవి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సురేష్ కుమార్, ఉప ప్రిన్సిపల్ ఎ.గోపిచంద్ అభినందించారు.

పలు హోటళ్లపై అధికారుల దాడి

ఉండి: మండలంలోని పలు హోటళ్లపై పౌరసరఫరాల శాఖ అధికారులు సోమవారం దాడులు చేసి 13 గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఉండి పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మోరంపూడి మహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వరరావు మాట్లాడుతూ జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు హోటళ్లపై దాడులు జరపగా ఉండిలోని హరిప్రియ బేకరీలో మూడు సిలిండర్లు, నెల్లూరు భోజనం హోటల్‌లో 8 గ్యాస్ సిలిండర్లు, హర్యానా జిలేబి సెంటర్లో ఒక గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకుని ఆ షాపు యజమానులపై 6ఎ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులలో స్వాధీనం చేసుకున్న 13 గ్యాస్ సిలిండర్లను ఉండిలోని శ్రీశంకర సాయి ఇండేన్ గ్యాస్ కంపెనీకి అప్పగించినట్లు ఆయన వివరించారు. త్వరలోనే మరిన్ని హోటళ్లపై తమ సిబ్బందితో దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు.

25 నుంచి ఎపిపిఎస్‌సి పరీక్షలు : డిఆర్ఒ

భీమవరం : ఈనెల 25, 26, 27 తేదీల్లో ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఈ నేపథ్యంలో పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో పరీక్షల ఏర్పాట్లుపై డిఆర్ఒ సమీక్షించారు. ఈనెల 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, 25, 26 తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అనలిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగాలకు, 26, 27న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఎపిపిఎస్‌సి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, PALAPARTHI VIJAYA LAKSHMI W/o Palaparthi Samuel John, D.No. 3-126, Ambedkar Nagar, Rustumbada Rural, Narasapuram Mandal, W.G.Dt., I have changed my name from VIJAYA LAKSHMI SAMUEL JOHN (Old name) to PALAPARTHI VIJAYA LAKSHMI (New name) hence forth I am being called PALAPARTHI VIJAYA LAKSHMI W/o Palaparthi Samuel John for all purposes.

ప్రకటన
మహారాష్ట్రీ రెంట్ కంట్రోలర్ అప్పిలేట్ ట్రిబ్యునల్ మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1199/2024 in R.C.A.No. 1/2019
Between:
దుడుగుంట్ల సతీష్ కుమార్ పరియోకుడు ...పిటిషనరు
Vs
దుడుగుంట్ల వెంకటేశ్వరరావు వగైరాలు ...ప్రతివాదులు
ఈ నెంబరు దావాలో ... ప్రతివాదులు దుడుగుంట్ల గురు ప్రసాద్, తండ్రి: వెంకటేశ్వరరావు, డోర్ నెం. 9-14-2, కృష్ణుడు చెరువు వద్ద, తాడేపల్లిగూడెం ... /evade ... ది.04-04-2025వ తేదిన ఉదయం 10-30 గం||లకు ... కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం.
ధూళిపాళ సూర్య రామారావు
తాడేపల్లిగూడెం పిటిషనరు తరపు న్యాయవాది
తేది:24-03-2025 తాడేపల్లిగూడెం

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 243/2021
బిట్విన్: బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం -వాది
అండ్
ముమ్మిడివరపు నరేష్ అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు
సమన్స్ టు: D-1: ముమ్మిడివరపు నరేష్, S/o. నాగేశ్వరరావు, డోర్ నెం. 3-27, 4వ ఖాళ, గణ్నవరం, H/o అడవిపాలెం, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.
మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించుటకుగాను ... ది. 02-04-2025 సం||రం తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు ...
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది 3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప.గో.జిల్లా
ది. 24-03-2025 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)-కమ్-జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం
O.S. No. 295/2021
బిట్విన్: బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం -వాది
అండ్
సిరా వెంకటేష్ అండ్ అనదర్ ప్రతివాది -ప్రతివాదులు
సమన్స్ టు: D-2: మొల్లం రవికుమార్, S/o. సుబ్రహ్మణ్యం, డోర్ నెం. 24-2-1, శంభునిపేట, పాలకొల్లు-534260, ప.గో.జిల్లా.
మీరు వాది బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించుటకుగాను ... ది. 02-04-2025 సం||రం తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు ...
మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది 3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప.గో.జిల్లా
ది. 24-03-2025 సెల్: 98662 59514

మహారాజశ్రీ తూ||గో||జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, రాజమండ్రి వారి కోర్టులో
I.A. 2657/23, O.S. 48/19
Between:
Nakkella Baburao ...Petitioner/ Plaintiff
AND
Kesavarapu Venkata Bhaskara Rama Rao and Others ...Respondents/ Defendants
To:
R-6: Kesavarapu Sitarama Lakshmi, W/o. late Ramakrishna Rao, D.no. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-7: Kesavarapu Jaya Abhinav, S/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-8: Kesavarapu Jhana Samhitha, D/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
పై నెంబరు పిటీషన్‌లో 6 టు 8 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం 26-3-2025 కి వాయిదా అయివున్నది. ... రోజున ఉదయం గం|| 10.30 ని||లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియచెప్పుకోవలెను. ...
మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
వి.శ్రీనివాసరావు
పి.ఆర్.పి.యాదవ్
అడ్వకేట్లు, డో.నెం. 46-11-34
రాజమండ్రి దానవాయిపేట
15-3-2025 రాజమండ్రి-3

మహారాజశ్రీ తూ||గో||జిల్లా ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, రాజమండ్రి వారి కోర్టులో
I.A. 2658/23, O.S. 48/19
Between:
Nakkella Baburao ...Petitioner/ Plaintiff
AND
Kesavarapu Venkata Bhaskara Rama Rao and Others ...Respondents/ Defendants
To:
R-6: Kesavarapu Sitarama Lakshmi, W/o. late Ramakrishna Rao, D.no. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-7: Kesavarapu Jaya Abhinav, S/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
R-8: Kesavarapu Jhana Samhitha, D/o. late Rama Krishna Rao, D.No. 14-9-14, Narasapuram, W.G.Dt.,
పై నెంబరు పిటీషన్‌లో 6 టు 8 రెస్పాండెంట్లు అయిన మీకు నోటీసు నిమిత్తం 26-3-2025 కి వాయిదా అయివున్నది. ... రోజున ఉదయం గం|| 10.30 ని||లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయి తెలియచెప్పుకోవలెను. ...
మద్దూరి శివ సుబ్బారావు
మద్దూరి శివరామ శశిభూషణ్
వి.శ్రీనివాసరావు
పి.ఆర్.పి.యాదవ్
అడ్వకేట్లు, డో.నెం. 46-11-34
రాజమండ్రి దానవాయిపేట
15-3-2025 రాజమండ్రి-3

గ్రామపంచాయతీ కార్యాలయం, గూటాల, పోలవరం, ఏలూరు జిల్లా
బహిరంగ వేలం ప్రకటన తేది. 26-03-2025
ఏలూరు జిల్లా, పోలవరం మండలం, గూటాల గ్రామ పంచాయతీ పరిధిలో ఫెర్రీ పాట గూటాల నుండి వంగలపూడి వరకు లాంచీ నడుపుకొనుటకు 2025-26 సం||నకు తేది. 29-03-2025 శనివారం నాడు ఉదయం గం. 10.30 ని||ల నుండి గూటాల గ్రామ పంచాయితీ ఆఫీసు వద్ద ఫెర్రీ పాట జరుపబడును.

వ.నెం.	వివరములు	సాల్వెన్సీ 2025 సం||ము	చెల్లించవలసిన ధరావత్తు
1	ఫెర్రీ	5,00,000	1,00,000/-

("పడవ లేదా లాంచీ లైసెన్సుదారులను వరిగణలోకి తీసుకొబడును, లైసెన్సు నకలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, వాహనం రిజిస్ట్రేషన్ నకలు, ... పాల్గొనదలచిన వారు ఈ నకళ్ళు జతపరచవలెను.")
సదరు వేలం పాటలో పాల్గొనదలచినవారు పాటకు ముందుగా 2025 సంవత్సరమునకు సాల్వెన్సీ మరియు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవలెను.
పాట నియమ నిబంధనలకు కార్యాలయపు పనివేళలో పంచాయితీ కార్యదర్శి వారిని సంప్రదించవలను.
సం/- సిరిపురపు ప్రసాద్, సర్పంచ్, గూటాల గ్రామపంచాయితీ, పోలవరం మండలం, ఏలూరు జిల్లా.
సం/- తాతి విజయకుమారి, గ్రామపంచాయితీ కార్యదర్శి, గూటాల, పోలవరం మండలం, ఏలూరు జిల్లా.